సాక్షి
నిజామాబాద్


శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



ఇష్టారీతిన నీటి విడుదల

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఇష్టారీతిన నీటి విడుదల కొనసాగుతోంది.

- 8లో ▸



పోడు భూములు దక్కేనా..

ఇందల్‌వాయి రేంజ్ పరిధిలో పోడు పట్టాల పంపిణీలో అర్హులకు అన్యాయం జరుగుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /24.3

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత కారణంగా ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతమై ఉండవచ్చు. చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్



నిజామాబాద్ నాగారం : వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాయవార్ రాజేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం హైదరాబాద్ అబిడ్స్ రాఘవ రత్న టవర్స్ ఆల్ ఇండియా మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది వేముల గౌరీ శంకర్రావు ఆధ్వర్యంలో జరిగాయి. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వినియోగదారుల ప్రతినిధులు పాల్గొన్నారు. మన జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులుగా ఉన్న మాయవార్ రాజేశ్వర్‌కు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ధర్మాన్ని రక్షించాలి



నిజామాబాద్ సిటీ: రక్షాబంధన్ సందర్భంగా భారతీయులందరం ధర్మ రక్షణ కోసం సంకల్పం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవాహ రాజుల్‌వార్ దిగంబర్రావ్ అన్నారు. గురువారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కంఠేశ్వర్ ఉపనగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హిందుమతంలో ప్రతీ పండగ ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుందని చెప్పారు. ప్రముఖ దంత వైద్యుడు వినోద్ పవార్ హాజరై మాట్లాడారు. నగర సంఘచాలక్ శ్రీనివాస్, నగర సహ కార్యవాహలు దత్తు, సుమిత్ పాల్గొన్నారు.

అధికారులకు రాఖీ కట్టి నిరసన



నిజామాబాద్‌నాగారం: ఏఎన్‌ఎంలు సమ్మెలో భాగంగా గురువారం కలెక్టరేట్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శనం, డీఈవో దుర్గాప్రసాద్‌తో పాటు ఇతర సిబ్బందికి రాఖీలు కట్టి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, యూనియన్ నాయకులు సంధ్యారాణి, భాగ్యమ్మ మాట్లాడుతూ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని కోరారు. జిల్లా అధికారులు ప్రభుత్వాన్ని ఒప్పించి తమను రెగ్యులరైజేషన్ చేసే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు చక్రపాణి, మంజుల, కళావతి, భాగ్యలక్ష్మి, సుజాత, విట్టాబాయ్, రమాదేవి, రాణి సరస్వతి, సావిత్రి, శశికళ, వనజ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన




రుద్రూర్: కోటగిరి, పోతంగల్ మండలాల్లోని లింగాపూర్, కొల్లూర్ గ్రామాల్లో గురువారం బాన్సువాడ ఆర్డీవో భుజంగ్‌రావ్ పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను కూల్చివేయడంతో, పాఠశాలల్లో ఏర్పాటు చేయాల్సిన పోలింగ్ బూత్‌లను స్థానికంగా మార్పు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కొల్లూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో, లింగాపూర్‌లో గ్రామ పంచాయతీలో పోలింగ్‌బూత్‌ల నిర్వహణకు ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. తహసీల్దార్లు సాయిలు, ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

స్పీకర్‌కు మద్దతుగా తీర్మానం

రుద్రూర్: రాబోయే ఎన్నికల్లో బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కొండాపూర్ గ్రామస్తులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈమేరకు గురువారం గ్రామానికి వచ్చిన స్పీకర్‌కు గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మాన ప్రతిని అందజేశారు. కొండాపూర్‌ను కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామమంతా స్పీకర్ వెంటే ఉంటామని వారు స్పష్టం చేశారు.

ముఖం చాటేసిన మేఘం

- ఈనెల రెండో వారం వరకూ ఇంతే..!
- ఆ తర్వాతే జిల్లాకు వర్షసూచన
- నెల రోజులుగా జాడలేని చినుకులు
- ఎన్నడూ లేని విధంగా ఆగస్టులో లోటు వర్షపాతం
- పగలు, రాత్రి అధిక ఉష్ణోగ్రతలు నమోదు



సెప్టెంబర్ 15 తర్వాతే..!

ఎల్‌నినో ప్రభావంతో జిల్లావ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ 15 తర్వాతే జిల్లాకు వర్షసూచన ఉందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జూలై నెలలో అత్యధిక వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు, ప్రాజెక్టులు, చెరువులు పొంగిపొర్లాయి. వేల్పూర్‌లో ఒకేరోజు ఏకంగా 41 సెంటీమీటర్లకు పైనే వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో కేవలం జూలై నెలలోనే వర్షాలు కురిసాయి. తొలకరి జల్లులు కూడా ఆలస్యంగా పలకరించాయి.

సుభాష్‌నగర్ : వ్యవసాయాధారిత జిల్లాలో వర్షకాలం సీజన్‌లో చినుకుల జాడ లేదు. సీజన్‌లో సగటున అధిక వర్షపాతమే కురిసినప్పటికీ.. ఆగస్టులో 64 శాతానికి పైనే లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని ఆరుతడి, వరి, పసుపు, ఇతర రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో సెప్టెంబర్ రెండో వారం వరకూ ఇవే పరిస్థితులు ఉండొచ్చని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆ తర్వాత వర్షాలు కురిసే అవకాశముందంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆగస్టు నెలలో వర్షాలు పడని పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి.

ఎండాకాలం లాగానే..

ఆగస్టులో వర్షాలు మొహం చాటేయడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలు, రాత్రివేళల్లో ఎండాకాలంలో లాగానే నమోదు కావడంతో ప్రజలు ఉక్కపోతతో సతమతమౌతున్నారు. చాలా మంది ఏసీలు, కూలర్లను మళ్లీ వినియోగిస్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. సగటున పగలు ఉష్ణోగ్రతలు 32 డిగ్రీలు, రాత్రివేళ 25 డిగ్రీల వరకు నమోదవుతోంది. మరో పక్షం రోజులు ఇవే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నెలరోజులుగా..

జిల్లావ్యాప్తంగా ఆగస్టు నెలలో అడపదడపా చిరుజల్లులు మాత్రమే కురిశాయి. నెల రోజులుగా వర్షాలు జాడలేకుండా పోయాయి. ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో 23 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 9 మండలాల్లో సాధారణ, నిజామాబాద్ సౌత్ మండలంలో లోటు వర్షపాతం నెలకొంది. ఆగస్టులో మాత్రం జిల్లావ్యాప్తంగా లోటు వర్షపాతం ఉంది. 750 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 100 మి.మీ వరకు మాత్రమే కురిసింది. సుమారు 64 శాతానికి పైగా లోటు వర్షపాతం నమోదైంది. 2012, 2019లో ఈ తరహా లోటు వర్షపాతం నమోదైందని తెలిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో వర్షాలు పడని పరిస్థితులు నెలకొన్నాయి. 5.63 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. లోటు వర్షపాతంతో ఆరుతడి పంటలు వాడిపోతుండగా, వరి పొలం కొన్నిచోట్ల పగుళ్లు ఏర్పడుతోంది. పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయి. ఇప్పటికే వ్యవసాయాధికారులు పలు సూచనలు, సలహాలు రైతాంగానికి వివరిస్తున్నారు.

జిల్లాలో నమోదైన పంటల వివరాలు

పంట	ఎకరాలు
వరి	4,00,000
సోయా	50,187
మొక్కజొన్న	38,411
పసుపు	20,477
పత్తి	2,670
కంది	1,057
పెసర	32
మినుము	71
వేరుశనగ	185

అర్హులందరికీ పింఛన్లు, పక్కా ఇళ్లు



అంబంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

- తెలంగాణలోనే రైతుబీమా పథకం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్ : బాన్సువాడ నియోజకవర్గంలో అర్హులందరికి పింఛన్లు, పక్కాఇళ్లు ఇస్తామని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రుద్రూర్ మండలం లక్ష్మీపూర్ క్యాంప్, అంబం(ఆర్), కొండాపూర్ గ్రామాల్లో గురువారం వివిధ అభివృద్ధి పనులకు గురువారం స్పీకర్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అంబం (ఆర్) కొండాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు ఇతర ఏ రాష్ట్రాల్లోనూ లేవన్నారు. దేశంలో 57 ఏళ్ల నిండిన వారికి రూ. 2016 పింఛన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అన్నారు.

అర్హులందరికీ గృహలక్ష్మి పథకం

అర్హులందరికి గృహలక్ష్మి పథకం ద్వారా పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని స్పీకర్ పోచారం అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటికే 11వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించామన్నారు. అంబం (ఆర్)లో ఉన్న ప్రభుత్వ స్థలంలో జాగాలేని పేదలకు 75 గజాలు స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కొండాపూర్‌ను జీపీగా చేస్తున్నామన్నారు.

ఇప్పటికే కొండాపూర్‌కు రూ.81లక్షలు కేటాయించామన్నారు. గ్రామంలో అందరు పేదలే ఉన్నందున అన్ని కుటుంబాలకు గృహలక్ష్మి పథకం వర్తింపచేస్తామన్నారు. కోటయ్య క్యాంప్– కోటగిరి రోడ్డు వెడల్పుకు ప్రతిపాదనలు రూ. 22 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, స్థానిక సర్పంచ్ కొర్వ భాగ్యభూషణ్, ఎంపీపీ సుజాతనాగేందర్, జడ్పీటీసీ నరోజి గంగారాం, ఎంపీటీసీ లక్ష్మి, అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



బాజిరెడ్డికి రాఖీ కడుతున్న సోదరి శారద

ఘనంగా రాఖీ

జిల్లావ్యాప్తంగా గురువారం రాఖీ పూర్ణిమను ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా పలువురు అధికారులకు మహిళలు రాఖీలు కట్టారు. ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఆయన సోదరి శారద రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. – సుభాష్‌నగర్

అస్తవ్యస్తంగా రుణమాఫీ

- వ్యవసాయ శాఖ వద్ద అందుబాటులో లేని రైతుల జాబితా
- మాఫీ వర్తించని రైతుల పరిస్థితి అయోమయం
- ఎవరిని సంప్రదించాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్న అన్నదాతలు



మోర్తాడ్: పంట రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్న దానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పొంతన లేదనే వాదన వినిపిస్తుంది. అందరు రైతులకు ఏకకాలంలోనే రుణమాఫీ నిధులను విడుదల చేశామని ప్రభుత్వం పక్షం రోజుల కిందనే వెల్లడించింది. ఇప్పటి వరకు 25 శాతం లోపు మంది రైతులకే మాఫీ అయినట్లు వ్యవసాయ శాఖ సేకరించిన లెక్కల ప్రకారం వెల్లడవుతుంది. ఇంకా 75 శాతం రైతులకు రుణాలు మాఫీ కావాల్సి ఉండగా వ్యవసాయ శాఖ వద్ద ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం. రుణం మాఫీ వర్తించని రైతులు బ్యాంకులకు వెళ్తే పై నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని, రైతుల రుణం ఖాతాల్లోనే సొమ్ము జమ చేస్తున్నారని చెబుతున్నారు. రుణంమాఫీకి అర్హత సాధించిన రైతుల జాబితాలు అటు వ్యవసాయ శాఖ వద్ద ఇటు బ్యాంకర్ల వద్ద లేకపోవడంతో గందరగోళం నెలకొంది. రుణం మాఫీకి సంబంధించి రైతుల మొబైల్ ఫోన్‌లకు ఎస్‌ఎంఎస్ వస్తేనే తెలుస్తుంది. బ్యాంకుల ఖాతాలతో మొబైల్ నంబర్ అప్‌డేట్ చేయకపోయినా సమాచారం లభించే పరిస్థితి లేదు. జిల్లాలో రుణ మాఫీ లక్ష్యంను రూ.1,790 కోట్లుగా నిర్ధారించారు. అర్హత సాధించిన రైతులు 2,91,188 మంది అని తేల్చారు. ఇప్పటి వరకు 57,241 మంది రైతులకు రూ.244.14 కోట్ల మాఫీ సొమ్ము జమ చేశారు. ఇంకా 2,33,947 మంది రైతులకు రూ.1,546 కోట్ల రుణం మాఫీ కావాల్సి ఉంది. రుణమాఫీపై వ్యవసాయ శాఖ, బ్యాంకుల వద్ద పక్కా సమాచారం లేకపోవడంతో ఏమైనా ఫిర్యాదులు ఉంటే ఎవరికి విన్నవించాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. రాష్ట్ర రాజధాని నుంచి మానిటరింగ్ జరుగుతుండటంతో క్షేత్రస్థాయిలో సమాచారం ఉండటం లేదని తెలుస్తుంది. రుణమాఫీ వర్తించని రైతులు తమ సమాచారాన్ని ప్రభుత్వానికి తెలిపేందుకు ఒక సెల్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

దశల వారీగా జమ

దశల వారీగా రైతుల రుణ ఖాతాల్లో మాఫీ సొమ్ము జమ చేస్తున్నారు. మేము బ్యాంకర్ల నుంచి సమాచారం సేకరిస్తున్నాం. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రుణమాఫీకి ఇంకా గడువు ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

టీచర్ల బదిలీలు పక్కాగా జరగాలి

- వీసీలో ఆదేశాలిచ్చిన విద్యాశాఖ మంత్రి
- నేడు షెడ్యూల్ ప్రకటన

నిజామాబాద్‌అర్బన్ : టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి డీఈవోలను ఆదేశించారు. గురువారం డీఈవోలతో ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా నుంచి డీఈవో దుర్గాప్రసాద్ వీసీలో పాల్గొన్నారు. పదోన్నతులపై స్టేను హైకోర్టు ఎత్తివేసినందువల్ల ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు వెంటనే బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు ప్రకటించాలని విద్యాశాఖ మంత్రి డీఈవోలను ఆదేశించారు. నేటి సాయంత్రం వరకు షెడ్యూల్ విడుదల కానుంది.

ఇవీ నిర్ణయాలు..

సెప్టెంబర్ (నేడు) ఒకటవ తేదీ కటాఫ్ డేట్‌గా టీచర్లకు 8ఏళ్లు, హెచ్‌ఎంలకు ఐదేళ్లు నిర్ణయించారు. 8 సంవత్సరాల 5 నెలలు పూర్తయిన టీచర్లు, హెచ్‌ఎంల స్థానాలను ఖాళీలుగా జాబితాలో చేరుస్తారు. రిటైర్డ్‌మెంట్‌కు మూడేళ్లలోపు సర్వీస్ ఉన్న టీచర్లు, హెచ్‌ఎంలకు బదిలీలకు మినహాయింపు ఇస్తారు. అన్ని రకాల పదోన్నతులకు సంబంధించి సీనియార్టీ జాబితాలను సిద్ధం చేసుకోవాలని రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా అధికారులకు సూచనలు ఇచ్చారు. కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి, ఎడిట్ చేసుకోవడానికి అవకాశం ఇస్తారు. గతంలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల దరఖాస్తులను ఎడిట్ చేసుకునే అవకాశాన్ని అదనంగా స్పౌజ్ బదిలీలకు పాయింట్లు దరఖాస్తు చేసుకోవచ్చు లేదా తొలగించుకోవచ్చు. రెండు రోజుల్లో టీచర్ల బదిలీలకు సంబంధించి పూర్తిస్థాయి ప్రక్రియ ప్రారంభమవుతుంది.



బదిలీలు, పదోన్నతులకు దరఖాస్తులు స్వీకరిస్తున్న విద్యాశాఖ అధికారులు (ఫైల్)

కొందరికేనా పదోన్నతులు..

త్వరలో ఇవ్వనున్న పదోన్నతుల్లో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టుల భర్తీ లేకపోవడంతో ఎస్జీటీలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఇచ్చే ప్రమోషన్లలో కేవలం 200 నుంచి 250 మంది ఎస్జీటీలు మాత్రమే లబ్ధి పొందనున్నారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులు మళ్లీ వచ్చే పదోన్నతుల వరకు ఎదురు చూడాల్సిందే. ప్రభుత్వం చివరిసారిగా 2015లో పదోన్నతులు ఇచ్చింది. ఈ పదోన్నతుల్లో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులు పదోన్నతి ఇవ్వకపోవడంతో సీనియర్ టీచర్లు ప్రమోషన్ పొందకుండా పదవీ విరమణ పొందే అవకాశముంది. ప్రస్తుతం జిల్లాలో పదోన్నతుల్లో 1998, 2000 డీఎస్సీ వరకు పదోన్నతుల అవకాశం ఉంటుంది. మిగితా వారు 20 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసిన పదోన్నతి రాని పరిస్థితి నెలకొంది. ఇంకో పక్క ఉమ్మడి జిల్లాలో దాదాపు 550 మంది పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 100 కంటే ఎక్కువగా ఉంది. హెచ్‌ఎంల పర్యవేక్షణ లేక విద్యార్థులకు గుణాత్మక విద్య అందడం లేదు. సీనియర్ ఎస్జీటీ ఉపాధ్యాయులను ఇన్‌చార్జి హెచ్‌ఎంలుగా కొనసాగిస్తున్నారు.

ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలి



ఇప్పటికైనా అధికారులు ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలి. కోర్టుల్లో కేసులు ఇబ్బందుల్లేకుండా రాకుండా చూడాలి. గత కొన్నేళ్లుగా టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల కోడ్ కంటే ముందే పూర్తి చేయాలి.

– రమేశ్, స్కూల్ అసిస్టెంట్, బినోల పాఠశాల

అర్హులందరికీ లబ్ధి చేకూరాలి



అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా చేయాలి. బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టి ముగించాలి. ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇకనైనా ఈ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలి. పదోన్నతుల్లో, బదిలీల్లో అందరికి లబ్ధి చేకూరాలి.

– లక్ష్మణ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

పేకాట కోసం ఇతర రాష్ట్రాలకు..

- నిజామాబాద్ నుంచి అప్పారావుపేట్‌కు మారిన స్థావరాలు
- టాస్క్‌ఫోర్స్ దాడులతో మకాం మార్చిన వైనం
- రోజూ కార్లలో 160 మంది వరకు..
- నిర్మల్ జిల్లాకు సరిహద్దులోనే అడ్డాలు



ఖలీల్‌వాడి : జిల్లాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేస్తుండడం, కేసులు నమోదవుతుండడంతో పేకాటరాయుళ్లు రూటు మార్చారు. మహారాష్ట్ర సరిహద్దులోని నాందేడ్ జిల్లాలోని అప్పారావుపేట పేకాట కేంద్రానికి వెళ్లి పేకాడుతున్నారు. జిల్లా నుంచి పేకాట ఆడేందుకు సుమారు 40 కార్లలో వెళ్తుంటారు. అనధికారకంగా నాందేడ్ పోలీసుల అనుమతి తీసుకొని నడిపిస్తుండడంతో పూర్తి స్థాయి భద్రత ఉంటుందని భావిస్తున్న పేకాటరాయుళ్లు అక్కడికి అధిక సంఖ్యలో వెళ్తున్నారు. దీంతో అప్పారావుపేటలోని పేకాట కేంద్రం కళకళలాడుతోంది. అక్కడికి వెళ్లినవారికి అన్ని రకాల వసతులు కల్పిస్తారు. ఉదయం 10 గంటలకు వెళ్లిన పేకాటరాయుళ్లు రాత్రి 12 గంటల వరకు అక్కడే జూదమాడి మద్యం సేవించి భోజనం చేసి అర్ధరాత్రి ఇంటి దాకా తీసుకొచ్చి వదిలేస్తారు. డబ్బులు పెట్టి పేకాట ఆడే వారు 'చలో అప్పారావుపేట్' అంటూ వాట్సాప్‌లో చర్చించుకోవడం కొసమెరుపు.

రూ. 5 వేల నుంచి ప్రారంభం..

అప్పారావుపేట పేకాటకేంద్రంలో రూ. 5 వేల నుంచి రూ. 30 వేల వరకు టేబుళ్లను ఏర్పాటు చేశారు. టేబుళ్లలో ఏడుగురు చొప్పున అందుబాటులో ఉండేలా పేకాట కేంద్ర నిర్వాహకుడు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పేకాట కేంద్రానికి కారులో తీసుకువచ్చే వారికి ఒక్కొక్కరికి రూ. 3 వేల వరకు పేకాట నిర్వాహకుడు ఇస్తాడు. కారులో నలుగురిని తీసుకెళ్తే రూ. 12 వేలు నిర్వాహకుడు ఇస్తారు. వచ్చినవాళ్లు ఈ పేకాట కేంద్రంలో కనీసం మూడు నుంచి ఐదు రౌండ్లు ఆడాల్సి ఉంటుంది. అప్పుడే కారు డ్రైవర్‌కు ఒక్కొక్కరి తరపున రూ. 3వేలు అందుతాయి. లేకపోతే డ్రైవర్‌కు ఏమీ ఇవ్వరని సమాచారం. జిల్లాలో పేకాట ఆర్గనైజర్‌లుగా పని చేసిన వారే కార్లను ఏర్పాటు చేసి తీసుకెళ్తున్నట్లు సమాచారం.

టాస్క్‌ఫోర్స్ దాడులు

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు బాధ్యతలు స్వీకరించిన తర్వాత పేకాటపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్‌బాబు ఆధ్వర్యంలో జిల్లా తోపాటు పలు ప్రాంతంలో పేకాట స్థావరాలపై దాడులు చేశారు. రెండు నెలల నుంచి వారంలో రెండు నుంచి మూడు పేకాట కేంద్రాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ నిర్మల్ జిల్లా ఎస్పీగా ఉన్నందున మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పేకాట కేంద్రానికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటే పేకాట నివారించే అవకాశం ఉంటుంది.

నిర్మల్ నుంచి దగ్గర..

జిల్లా నుంచి వెళ్లేవారు నిర్మల్ జిల్లాలోని ఆడెల్లి పోశమ్మ నుంచి 25 కి.మీ దూరంలో అప్పారావుపేట పేకాట కేంద్రం ఉంటుంది. మహారాష్ట్రలోని నాందేడ్, నిర్మల్ జిల్లాల సరిహద్దులోని చెక్‌పోస్టుకు కొద్దిదూరంలోనే పేకాట కేంద్రం ఉంటుంది. దీంతో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ తోపాటు జగిత్యాల జిల్లా కేంద్రంతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన పేకాటరాయుళ్లు ఆడేవారు ఎక్కువ మంది వెళ్తుంటారు. ఈ పేకాట కేంద్రంలో 20 నుంచి 30 టేబుల్‌లు ఏర్పాటు చేశారు.

మున్సిపల్ ఆర్‌వో నరేందర్ బదిలీ!

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ కార్పొరేషన్ ఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న నరేందర్ బోధన్‌కు బదిలీ అయినట్లు సమాచారం. గురువారం బదిలీ ఉత్తర్వులు వెలువడినట్లు తెలిసింది. బోధన్ మున్సిపాలిటీకి మేనేజర్‌గా బదిలీపై వెళ్లనున్నారు. అక్కడ మేనేజర్‌గా ఉన్న నరేందర్ నిజామాబాద్‌కు రానున్నట్లు సమాచారం. టీపీవోగా సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఐఎంబీఏ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలో కొనసాగుతున్న ఐఎంబీఏ 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ గురువారం తెలిపారు. పరీక్షలకు 25 విద్యార్థులకు 24 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌లో గురువారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన టీకే రాజయ్య ఇటీవల మృతి చెందడంతో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ ఆదేశాల మేరకు మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పల్లె రవికుమార్‌కు సన్మానం



కామారెడ్డి టౌన్: రాష్ట్ర గీతా పారిశ్రామిక ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ పిట్టల రవీందర్‌లను గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బాలార్జున్ గౌడ్, దశాగౌడ్, నర్సాగౌడ్, రాజగౌడ్, భరత్ గౌడ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు బట్టు విఠల్ తదితరులున్నారు.

కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- టీజీబీ మేనేజర్ నరేశ్



రామారెడ్డి: కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను రామారెడ్డి గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్(టీజీబీ) మేనేజర్ నరేశ్ సూచించారు. గురువారం రామారెడ్డిలోని రాములవారి ఆలయ సమీపంలో సుంకోజి భాగ్యలక్ష్మి తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు సంబంధించిన కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను మేనేజర్ నరేశ్, సర్పంచ్ సంజీవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. ఏ బ్యాంకుకు సంబంధించిన ఖాతా నుంచి అయినా డబ్బులను కస్టమర్ సర్వీస్ పాయింట్ నుంచి ఎలాంటి రుసుము చెల్లించకుండా నెలలో రూ.10 వేల చొప్పున 5 సార్లు తీసుకునే వెసులుబాటు సర్వీస్ పాయింట్ ద్వారా లభిస్తుందని తెలిపారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డు లింక్ ఉన్న ఖాతాదారులు ఫింగర్ ప్రింట్, ఆధార్ నంబర్ ద్వారా డబ్బులు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

అర్హులకు పోడు భూములు దక్కేనా..?

- అన్యాయానికి గురవుతున్న లబ్ధిదారులు
- చోద్యం చూస్తున్న అటవీశాఖ అధికారులు



చంద్రాయన్‌పల్లి శివారులో ఆక్రమణకు గురవుతున్న అటవీ శాఖ భూమి

ఇందల్వాయి: ఇందల్వాయి అటవీశాఖ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. రాజకీయ అండదండలు, డబున్న వారికి వత్తాసు పలుకుతూ అర్హులకు పంపిణీ చేయాల్సిన పోడు భూములను పేదలకు దక్కకుండా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక, కలప అక్రమ రవాణా, అటవీ భూముల ఆక్రమణకు అటవీ శాఖ సిబ్బంది లోపాయికారి ఒప్పందాలతో సహకరిస్తున్నారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

పోడు పట్టాల పంపిణీలో గందరగోళం

నల్లవెల్లి గ్రామంలోని 309 సర్వే నంబరులో 40 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన హరిజనులకు నాటి ప్రభుత్వం భూపంపిణీ చేసింది. వారిలో కొంతమందికి పట్టాలు రాగా మరికొంత మందికి పట్టాలు రాలేదు. రెవెన్యూ, అటవీ శాఖ వివాదంలో ఆ భూములు ఉన్నాయంటూ అటవీశాఖ అధికారులు అర్హులకు పొంతన లేని మాటలు చెబుతున్నారు. పోడు పట్టాల కోసం సర్వే చేసి పై అధికారులకు నివేదిక పంపినా 309 సర్వే నంబరులో అసలైన హరిజన రైతులు పట్టాలు పొందలేక పోయారు.

ఏడాది క్రితం సాగు చేసిన వారికి పట్టాలు

కేకే తండాలో ఏడాది క్రితం అటవీ భూములు సాగు చేస్తున్న రైతులకు నిబంధనలకు విరుద్ధంగా పోడు పట్టాలు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. పోడు పట్టాల సాకుతో 237 సర్వే నంబరులోని 20 ఎకరాలకు పైగా అటవీ భూమి ఆక్రమణకు గురైంది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా.. తాము అనర్హులని తేల్చినా ప్రభుత్వం పట్టాలు జారీ చేసిందని పేర్కొన్నారు. అధికారులు సాగును అడ్డుకుంటూ కేసులు నమోదు చేస్తున్నామని చెబుతున్నా ఆక్రమణ, సాగు ఎక్కడా ఆగడం లేదు.

పట్టాలు ఉన్నా సాగుకు నిరాకరణ..

రేంజ్ పరిధిలోని పలు గ్రామాల్లో అటవీ శాఖ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా అర్హులైన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్డ్ పట్టాలు ఉన్నా సాగు చేసుకునేందుకు అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు. చెట్లు ఉన్నాయంటు, అటవీ శాఖ సరిహద్దు సమస్యలు ఉన్నాయంటూ పలు కారణాలతో అర్హులైన తమను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టాలు మంజూరు కాలేదు

నల్లవెల్లి శివారులోని 309 సర్వే నంబరు రెవెన్యు భూమిలో ఎస్సీ కులస్తులకు చెందిన చాలా మంది 40 ఏళ్లుగా సాగులో ఉన్నా నూతన పట్టాలు రాలేదు. నాటి ప్రభుత్వం జారీ చేసిన పాత పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయి. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా అటవీ-రెవెన్యూ సరిహద్దు సమస్యలు ఉన్నాయంటూ తమకు పట్టాలను మంజూరు చేయలేదు. దీంతో అధికారుల నిర్లక్ష్యంగా ఐదేళ్లుగా రైతుబంధును కోల్పోతున్నాం.

– వాడె గంగాధర్, రైతు, నల్లవెల్లి

అనర్హులకు పట్టాలు మంజూరు

కేకే తండాలో పోడు పట్టాల మంజూరులో తాము అనర్హులమని తేల్చిన వారికి పట్టాలు మంజూరయ్యాయి. నల్లవెల్లి, గౌరారం, పలు గ్రామాల్లో అటవీ-రెవెన్యూ సరిహద్దులు తేల్చాల్సి ఉంది. అటవీ భూములు ఎక్కడా ఆక్రమణకు గురైన చర్యలు చేపడుతున్నాం. అటవీ ప్రాంతం నుంచి ఇసుక, కలప అక్రమ రవాణా, అటవీ భూములకు గురైనట్లు గుర్తిస్తే ప్రజలు సమాచారం అందించాలి.

– హిమచందన, ఎఫ్ఆర్వో, ఇందల్వాయి

జీపీలకు పక్కా భవనాలు

- రూ. 20 లక్షలతో నిర్మాణ పనులు

నిజాంసాగర్(జుక్కల్): గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. 'పల్లె సీమలు దేశానికి పట్టుగొమ్మలు'గా నిలువాలన్న సంకల్పంతో జీపీల అభ్యున్నతికి పెద్ద పీట వేసింది. పల్లె ప్రగతి పనులతో ప్రగతి బాట పడుతున్న పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో జీపీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు కావడంతో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి.

27 గ్రామ పంచాయతీలకు..

నిజాంసాగర్ మండలంలో 27 జీపీలు ఉండగా సొంత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బంజపల్లి, అచ్చంపేట, బ్రాహ్మణపల్లి, మాగి, గోర్గల్, గున్కుల్, బూర్గుల్, ముగ్దుంపూర్ జీపీల సొంత భవనాల నిర్మాణాలకు రూ. 20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. సర్పంచులు సైతం జీపీ నిర్మాణ పనులపై దృష్టి సారించారు. తమ పదవి కాలం పూర్తయ్యే నాటికి సొంత భవనాలు పూర్తి చేసేలా సర్పంచులు కార్యచరణ రూపొందించారు. ఇప్పటికే మాగి, గోర్గల్ జీపీ భవన నిర్మాణ పనులు పూర్తికావడంతో పాటు ప్రారంభోత్సవాలు సైతం చేపట్టారు. ప్రస్తుతం అచ్చంపేట, బ్రాహ్మణపల్లి, బూర్గుల్, ముగ్దుంపూర్ జీపీల్లో భవన నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. వచ్చే నెల మొదటి వారంలో జీపీ భవనాలను ప్రారంభించనున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్‌శోభారాజు చేతుల మీదుగా ప్రారంభోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ముగ్దుంపూర్‌లో పూర్తి దశకు చేరిన జీపీ భవనం పనులు

ఉర్దూలో ఫహీముద్దీన్‌కు డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): టీయూ ఉర్దూ విభాగం పరిశోధక విద్యార్థి ఫహీముద్దీన్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. టీయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో ఫహీముద్దీన్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి డాక్టరేట్‌ను గురువారం అందజేశారు. ఉర్దూ మాజీ డీన్ ప్రొఫెసర్ అత్తర్ సుల్తానా పర్యవేక్షణలో 'తెలంగాణ ఉర్దూ జర్నలిజంలో భవిష్యత్ అవసరాలు' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. కార్యక్రమంలో కర్ణాటక గుల్బర్గా యూనివర్సిటీ ప్రొఫెసర్ హస్మత్ అలీ, కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కనకయ్య, బీవోఎస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ ఖవి, ఉర్దూ విభాగాధిపతి గుల్ ఈ రానా, అసోసియేట్ ప్రొఫెసర్ మూసా ఖురేషి, జమీల్ అహమ్మద్, అతిక్ సుల్తాన్ ఘోరీ, పున్నయ్య, నాగరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఫహీముద్దీన్‌ను సన్మానిస్తున్న డీన్లు, అధ్యాపకులు

మాదకద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

సుభాష్‌నగర్: యువత, విద్యార్థులను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన గురువారం జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై చర్చించి, వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి పెను ప్రమాదకరంగా మారిన మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అదనపు డీసీపీ జయరాం మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిరోధానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అయినా జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం ఒకింత ఆందోళన కలిగించే స్థాయిలోనే ఉందన్నారు. గడిచిన దశాబ్ద కాలంలో జిల్లాలో 254 కేసులు నమోదయ్యాయని, అంతే సంఖ్యలో విక్రేతలు, రవాణాదారులను అరెస్ట్ చేశామని వివరించారు. ఆంధ్ర ప్రాంతం నుంచి గంజాయి ఎక్కువగా జిల్లాకు చేరుతున్నట్లు తెలుస్తోందని, ఈ మేరకు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శనం, డీఈవో దుర్గాప్రసాద్, డీఐఈవో రఘురాజ్, వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రషీద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

ఇష్టారీతిన నీటి విడుదల



కాకతీయ కాలువలో ప్రవహిస్తున్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఇష్టారీతిన నీటి విడుదల చేపడుతున్నారు. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడులను పెంచడం, తగ్గించడం చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా వానాకాలం సీజన్‌లో వారబందీ ప్రకారం నీటి విడుదల చేపడుతామని అధికారులు ప్రకటించారు. ఈ లెక్కన వారం రోజులు 5,500 క్యూసెక్కులు, మరో 8 రోజులు 3 వేల క్యూసెక్కుల నీటిని వదలాలి. కానీ అధికారులు ఇష్టారీతిన నీటి విడుదల చేస్తున్నారు. నెల రోజుల నుంచి వానలు లేక పంటలు ఎండుతున్నాయి. అయినా కాలువ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల మించి వదలడం లేదు. ఎగువ నుంచి వరద పెరిగినప్పుడు మాత్రమే నీటి విడుదలను పెంచుతున్నారు.

కాలువల ద్వారా..

ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెకుకలు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 360 క్యూసెక్కులు, మిషన్ భగీరథ కోసం 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కులు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.60(88.11 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

బహుబాగు.. ఆరుతడి సాగు



జుక్కల్‌లో సాగవుతున్న సోయా పంట



మద్నూర్ శివారులో సాగవుతున్న పత్తి పంట

- పచ్చదనంతో పంటపొలాలు

నిజాంసాగర్(జుక్కల్): వర్షాధారంగా సాగు చేసిన ఆరుతడి పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ముందుస్తుగా సోయా, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులను ఇటీవల కురిసిన వర్షాలు ఆదుకుంటున్నాయి. జిల్లాలోని సదాశివనగర్, గాంధారి, బాన్సువాడ, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నాగిరెడ్డిపేట, లింగంపేట, తాడ్వాయి మండలాల్లో ఆరుతడి పంటల సాగు బహుబాగుగా మారింది. ఆయా మండలాల్లో 82 వేల ఎకరాల్లో సోయా పంట, 59 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 23 వేల ఎకరాల్లో పత్తి, మిగతా పెసర, మినుము, రెడ్‌గ్రాం పంటలు సాగు చేస్తున్నారు.

క్రైం కార్నర్

ఇద్దరు నిందితులకు జైలు శిక్ష

ఆర్మూర్‌టౌన్/నందిపేట్/బాల్కొండ: విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల నుంచి ఆయిల్ కాపర్ కాయిల్స్ దొంగతనానికి పాల్పడిన ఇద్దరి నిందితులకు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వేముల దీప్తి ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో వో సురేశ్‌బాబు, నందిపేట్ ఎస్సై రాహుల్, బాల్కొండ ఎస్సై గోపి గురువారం తెలిపారు. హైదరబాద్‌కు చెందిన ఏసుదాస్, మెదక్ జిల్లాకు చెందిన శ్రీధర్ ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 4, బాల్కొండలో 5, ముప్కాల్‌లో 3, మెండోరాలో 2, నందిపేటలో 3 మొత్తం 17 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్‌తో పాటు కాపర్ కాయిల్స్ చోరీ చేసినట్లు పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వరి వాదనలు వినిపించి నిందితులకు శిక్షపడేలా చేశారని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని విద్యానగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో గురువారం చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలోని రాజారపు శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లి బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి ఐదు తులాల బంగారు నగలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

4న ద్విచక్ర వాహనానికి వేలం

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈనెల 4న ద్విచక్ర వాహనానికి వేలం నిర్వహించినట్లు సీఐ షాకీర్ అహ్మద్ గురువారం తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయంలో హెచ్‌ఎఫ్ డీలక్స్ గల ద్విచక్ర వాహనాన్ని రూ. 21వేల500గా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ. 3 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

ఆర్మూర్‌లో ఒకరి అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పరిధిలోని పెర్కిట్‌లో విఠోబా అనే వ్యక్తి ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించి దాడి చేయడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై అశోక్ గురువారం తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి విఠోబాపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడి గ్రామ శివారులో గురువారం ఓ కారు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన పి. దినేశ్, ఎండీ జలీల్ ఫోర్డ్ కారులో తూప్రాన్ నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా ఆకస్మాత్తుగా కారులో నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన వీరు వెంటనే కారు నుంచి దిగారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.



సదాశివనగర్ శివారులో కాలిపోతున్న కారు

వేర్వేరు కారణాలతో నలుగురు మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తలారి స్వామి(23) ఇటీవల దుబాయికి వెళ్లి తిరిగివచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

తాగుడుకు బానిసై..

బాన్సువాడ: బీర్కూర్ మండలం వీరాపూర్ దుబ్బాకు చెందిన కడమంచి రవి(17) తాగుడుకు బానిసై గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నంద తెలిపారు. తాగుడు మానివేయాలని తల్లి మందలించడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడి తల్లి లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన ఉప్పల చిన్న ఆజయ్య (50) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆజయ్య బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లగా తిరిగి రాలేదని కుటుంబీకులు తెలిపారు. ఎత్తొండ రహదారి వద్ద మృతదేహం ఉందని స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా ఆజయ్య మృతదేహంగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూమికి ధర రావడం లేదని..

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని కన్నయ్యతండాకు చెందిన సాతల్ సింగ్(50) అనే రైతు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. కుటుంబ అవసరనిమిత్తం విక్రయించాలనుకున్న భూమికి సరైన ధర రాకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



మద్నూర్(జుక్కల్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయానికి గురువారం ఆయన ఉచితంగా పలు రకాల పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక పుస్తకాలు అందించానని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఎందరో విద్యార్థులు పుస్తకాలు కొనలేకపోవడంతో వారికి చేయూతనందించేందుకు పుస్తకాలను అందజేసినట్లు చెప్పారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మాజీ జెడ్పీటీసీ సాహెబ్‌రావ్, చౌలావార్ హన్మాండ్లు, దరాస్ సాయిలు, సుభాష్ జాదవ్, కార్యకర్తలున్నారు.

ముదక్‌పల్లిలో ఆటో ప్రమాదం

- ఏడుగురికి గాయాలు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ముదక్‌పల్లి చౌరస్తాలో ఆటో అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లడంతో ఏడుగురికి గాయాలైనట్లు ఎస్సై ఎల్ రాము గురువారం తెలిపారు. మంచిప్పకు చెందిన ఆటోలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుగురు ఆటోలో ప్రయాణిస్తుండగా డ్రైవర్ అతివేగంగా నడపడం వల్ల ముదక్‌పల్లి చౌరస్తాలో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులతో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.